క్లుప్తంగా

సజావుగా విత్తన వేరుశనగ పంపిణీ

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. పెద్దకోట్ల, నార్శింపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో 169 మంది రైతులకు 133.80 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారిణి రమాదేవి తెలిపారు. సబ్సిడీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాటమారెమ్మకు పూజలు



అలంకరణలో బాట మారెమ్మ దేవత

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలు తరలివచ్చి పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా భక్తులు అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



డిపోలో మొక్క నాటుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు

ధర్మవరం అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్టీసీ కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు కోరారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. డిపోలోని గ్యారేజ్, ట్రాఫిక్, డిపో మేనేజర్ ఆఫీస్, కార్గో విభాగాలను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ప్రతిభ చూపిన ఆదర్శ ఉద్యోగులను ఆయన అభినందించారు. ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సత్యనారాయణ, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

కుక్కర్ పేలి దంపతులకు గాయాలు

అమడగూరు: వంట వండుతున్న సమయంలో జౌకలకొత్తపల్లి ఏఎన్ఎం మంజుల దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం వంట చేసుకునే సమయంలో కుక్కర్‌కు ఉన్న విజిల్ రాకపోవడంతో గమనించని ఏఎన్ఎం భర్త మూత తీయడంతో అకస్మాత్తుగా పెద్దెత్తున శబ్దం వచ్చి పేలడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం గమనించిన మంజుల భర్త దగ్గరకు వెళ్లడంతో ఆమెకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరూ కదిరి ఆస్పత్రికి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న అమడగూరు ప్రభుత్వాస్పత్రి సిబ్బంది మంజుల ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉమ్మడి జిల్లావాసులే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

11న ఓడీచెరువు సంత వేలం

ఓడీచెరువు: మండల కేంద్రంలో వారపు సంత వేలం పాట ఈనెల 11న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శుక్రవారం తెలిపారు. వేలం దక్కించుకున్న వారికి అదే రోజు నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ వారపుసంత, లోడింగ్ అన్‌లోడింగ్ ఫీజుల వసూలు చేసుకునే హక్కు లభిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వారపు సంత, వారపుసంత, లోడింగ్ అన్‌లోడింగ్ ఫీజుల వసూలు హక్కు కోసం రూ.50 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

యువకుడి మృతి

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ గాంధీ (32) మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కురుబవాండ్లపల్లికి చెందిన గాంధీ వ్యక్తిగత పనుల నిమిత్తం మిత్రుడు భూషణతో కలిసి కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి వెళ్లి తిరిగి సొంతూరుకు వెళ్తుండగా, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గాయపడిన గాంధీని బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

వర్షంతో ఉపశమనం

- బత్తలపల్లిలో భారీ వర్షం

బత్తలపల్లి: మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు చిన్న కుంటలు, చెక్‌డ్యాంలకు నీరు వచ్చి చేరుతోంది. దీంతో పలు గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. తొలకరి వర్షాలకే వంకలు పారడం, చిన్న కుంటలు నిండడంతో ప్రజలు ఆనందపడుతున్నారు. గురువారం రాత్రి 68.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. ఇదిలా ఉండగా చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్లు నీటికుంటలను తలపిస్తున్నాయి. బత్తలపల్లిలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌కు వెళ్లే దారిలోనూ, టీచర్స్ కాలనీకి వెళ్లే దారితో పాటు పలు వీధుల్లో రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు మురుగు నీరు నిలువ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. పోట్లమర్రి ఈదుల వంక ప్రవహిస్తోంది. చెక్‌డ్యాంలోకి నీరు వచ్చి చేరింది. మండలంలోని పలు గ్రామాల్లోని చెక్‌డ్యాంల్లోకి నీరు వచ్చి చేరినట్లు సమాచారం.



చెన్నేకొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

ఇదిలా ఉండగా వరదాపురం, నల్లబోయనపల్లి, డి.చెర్లోపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పీఆర్‌టీ సర్కిల్‌లోని ప్రధాన రహదారిపై వర్షపునీరు నిలిచాయి. మురుగుకాలువలు వర్షపునీటితో నిండిపోయాయి. రహదారులపై నిలిచిన వర్షపునీటితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చెన్నేకొత్తపల్లి: కొన్ని రోజులుగా వేసవి తాపంతో అల్లాడిపోతున్న ప్రజలకు వరుసగా కురుస్తున్న వర్షాలతో ఉపశమనం లభిస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృత్తమైంది. మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. రైతులు పొలాల్లో దుక్కులు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.



బత్తలపల్లిలో కురుస్తున్న వర్షం



పీఆర్‌టీ సర్కిల్‌లో నిలిచిన వర్షపునీరు

పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మేధాశక్తి



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి

బత్తలపల్లి: పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి అధ్యక్షతన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. శ్రీజ్యోతి హైస్కూల్ ప్రిన్సిపాల్ మిడతల లక్ష్మీనారాయణ, డైరెక్టర్ మిడతల తేజ, ఉపాధ్యాయులు శంకరయ్య, రమేష్ యాదవ్, నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలలో విజ్ఞానం, విలువలు ఉండే దేవాలయం వంటిదన్నారు. విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వెళ్లి దినపత్రికలు, పుస్తకాలు తదితర వాటిని చదివి విజ్ఞానాన్ని సముపార్జించుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి మాట్లాడుతూ మే నెల 15 నుంచి జూన్ 7 వరకు 21 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి దినం కథలు చెప్పడం, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి అంశాలను సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు వివరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్ నాగరాజు, మురళి, ముకుంద, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

రొళ్ల: చరిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి గ్రామంలోని కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన ఇతరాత్ర పూజలు చేశారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యాన్ని అమ్మవారికి కట్టి పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ సమీపాన గల పాలబావి వద్దకు చేరుకుని గంగ పూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. కొందరు భక్తులు ఆలయ పరిసర ప్రాంగణంలో వంటకాలు చేసి బంధువులు, స్నేహితులను పిలిచి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజవంశీకుడు రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కదిరి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్టీసీ డిపో మేనేజర్ మైనోద్దీన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం డిపో గ్యారేజీ ఆవరణంలో ఆయన ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా పెంచాలన్నారు. తద్వారా సకాలంలో వర్షాలు పడి ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత, రామకృష్ణతో పాటు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నేటి నుంచి అక్కమ్మ గార్ల పరుష

నల్లమాడ: మండలంలోని సోమగుట్టపల్లి సమీపాన శనివారం నుంచి అక్కమ్మగార్ల పరుష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. సోమగుట్టపల్లి, పెద్దకోట్లపల్లి గ్రామపెద్దల ఆధ్వర్యంలో జరిగే పరుషలో తొలిరోజు దాసంగాలు, సోమవారం ఎలవ, మంగళవారం ఎద్దుల బండ్ల పోటీలు, బుధవారం కుంకాలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎడ్లబండ్ల పోటీలో విజేతలకు మొదటి బహుమతి కింద పెద్దకోట్లపల్లికి చెందిన సోదరులు అశోక్‌కుమార్‌రెడ్డి, తేజ్‌నాథ్‌రెడ్డి రూ,20 వేలు నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు పేర్కొన్నారు. ద్వితీయ బహుమతిగా రూ,10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలను ప్రతాప్‌రెడ్డి అందిస్తారన్నారు. కన్సేషన్ ఫీజు రూ.వెయ్యిగా పేర్కొన్నారు.

బడి బయటి పిల్లలపై సర్వే



చిన్నారులను పాఠశాలలో చేర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో శుక్రవారం ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి బడిబయట ఉన్న దివ్యాంగ పిల్లలపై సర్వే నిర్వహించారు. ఇద్దరు పిల్లలను గుర్తించి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొత్తం 17 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు సౌజన్య, అన్వేష్‌లు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

ముదిగుబ్బ: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి వైపునకు తీసుకుపోదామని ఎంపీపీ ఆదినారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో దోమలు ప్రబలి వ్యాధులు వ్యాపింపచేసే అవకాశం ఉందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుధ్యపు పనులు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన ప్రగతి నివేదికలను సమావేశంలో అధికారులు చదివి వినిపించారు. రైతులకు నాణ్యమైన విత్తన కాయలను పంపిణీ చేయాలని పొడరాళ్లపల్లి సర్పంచ్ నాగభూషణ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, తహసీల్దార్ సరస్వతి, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సీహెచ్ఓ నగేష్, ఎస్ఓయూ రమణయ్య పేర్కొన్నారు. శుక్రవారం కప్పలబండ గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల ఆవాసాలను నిర్మూలించాలన్నారు. ప్రతి ఇంటిలో దోమతెరలను వినియోగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీటి నిలువలను తొలగించి ఫ్రై డే డ్రై డే పాటించాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అడల్ట్ బీసీజీ టీకాలను అర్హులైన అందరూ వేయించుకోవాలన్నారు. 60 ఏళ్లు నిండినవారు, షుగర్ వ్యాధి ఉన్న వారు, టీబీ రోగులతో సన్నిహితంగా ఉన్న వారు ఈ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వెంకటరమణ, సిబ్బంది అపర్ణ, ప్రమీళ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం డ్రై డే ఫ్రైడే పురస్కరించుకుని వైద్య సిబ్బంది పారిశుధ్య చర్యలు నిర్వహించారు. తాడిమర్రి, కునుకుంట్ల, పిన్నదరి, నార్శింపల్లి, చిన్నచిగుళ్లరేవు, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, దాడితోట, చిల్లవారిపల్లిలో వైద్య సిబ్బంది వీధుల్లో పర్యటిస్తూ నీటి గుంతలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే నీటితొట్టెలు, చిప్పలు, పాత టైర్లలో నిల్వ ఉన్న వర్షపు నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్ఓ నారాయణమ్మ, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, లక్ష్మీకాంతమ్మ, సుగుణ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం చినగానిపల్లి, చీకిరేవులపల్లి, తుమ్మల, పూలకుంటపల్లి, మహమ్మదాబాద్, కస్సముద్రం గ్రామ పంచాయతీల్లో గ్రామస్తులకు మలేరియా వ్యాధి నివారణపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి నీటి తొట్టెలలోని నీటిని పారబోయించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ రాత్రి సమయంలో దోమతెరలను వాడాలన్నారు. అనంతరం మలేరియా సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గ్రామాలన్నీ ప్రశాంతంగా ఉండాలి

బత్తలపల్లి: గ్రామాలన్నీ ప్రశాంతంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు, బందోబస్తు నిమిత్తం వచ్చిన ఎస్ఐ మాలకొండయ్య కోరారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు బృందాలుగా వారు సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా అందరూ సంయమనం పాటించాలన్నారు. ప్రభుత్వ, ప్రవేట్ ఆస్తుల విధ్వంసాలకు పాల్పడొద్దని, అందరూ కలిసి కట్టుగా గ్రామాల అభివృద్ధికి పాటుపడదామన్నారు. కక్షల వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదన్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బత్తలపల్లిలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

బీసీలంతా ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

ధర్మవరం అర్బన్: బీసీలంతా ఐకమత్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, సీనియర్ నాయకులు బోయ రవిచంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో శుక్రవారం బీసీల ఆత్మీయ సమావేశాన్ని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, చేనేత నాయకులు గిర్రాజు రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరానికి పట్టుచీరల వల్ల ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. చేనేత పరిశ్రమపై అన్ని వర్గాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా బీసీలు అభివృద్ధి చెందలేదన్నారు. ప్రస్తుతం బీసీలంతా ఐకమత్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు బీసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలా బీసీ చట్టం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళదామని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు బొట్టు కిష్ట, పల్లపు రవీంద్ర, గోపాల్, పోతలయ్య, శివానంద, శ్రీనివాసులు, జింకల రాజన్న, పల్లపు శివశంకర్, చీమల రామంజి, పూలకుంట్ల మహేష్, సాయి, చందమూరు రమేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

కనగానపల్లి: జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే నాటికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తామని ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు 75 శాతం దాకా వచ్చాయన్నారు. వీటిలో 1 నుంచి 7వ తరగతి వరకు 6,265 పుస్తకాలు, 8 నుంచి 10వ తరగతులకు సంబంధించి 10,298 పుస్తకాలు సరఫరా చేశారన్నారు. ఇంకా 6,950 పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. వీటితో పాటు విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లు కూడా ఒక్కొక్కటి ఎంఈఓ కార్యాలయానికి చేరుతున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభం కాగానే వీటన్నింటిని మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీదేవి, ఎంఐఎస్ రామన్న, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కనగానపల్లి ఎంఈఓ కార్యాలయంలో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

నీట్‌లో మెరిసిన ‘సాయి’ విద్యార్థులు

పుట్టపర్తి రూరల్: నీట్ పరీక్షల్లో పుట్టపర్తికి చెందిన సత్యసాయి విద్యార్థులు ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించారు. కత్తి భాస్కర్ రెడ్డి, కల్పనారెడ్డి దంపతుల కుమారుడు లిఖిత్‌రెడ్డి 352, ఎనుములపల్లి గ్రామానికి చెందిన ట్యాక్సీవాలా చెరువు రమణారెడ్డి, మాధవి దంపతుల కుమార్తె జ్యోత్స్న 2,953 ర్యాంక్ సాధించారు. వీరిద్దరూ సత్యసాయి విద్యాసంస్థల్లో పదో తరగతి వరకు విద్యనభ్యసించారు. ఈసందర్భంగా వారిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.



జ్యోత్స్న



లిఖిత్ రెడ్డికి కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఎనుములపల్లి చెరువుకు వర్షపునీరు

పుట్టపర్తి రూరల్: ఇరిగేషన్ అధికారుల చర్యలతో ఎనుములపల్లి చెరువకు వర్షపు నీరు చేరింది. పుట్టపర్తి మున్సిపాలిటీ నడి ఒడ్డున ఎనుములపల్లి చెరువు ఉంది. పట్టణానికే కాక పరిసర ప్రాంతాలకు సాగు, తాగునీరు కేంద్ర బిందువు. పుట్టపర్తి మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి నిర్మాణం కోసం చెరువు కాలవ గట్టును సుమారు 50 మీటర్లు పైగా తొలగించారు. రుతుపవనాలతో కురుస్తున్న కారణంగా వర్షం నీరు వృథాగా పోతోంది. ఈవిషయంపై గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఈ సుధాకర్ రాజు కాంట్రాక్టర్లతో కలసి శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి యంత్రాలను పిలిపించి తాత్కాలిక గట్టు ఏర్పాటు చేయించారు. దీంతో నీరు చెరువుకు వర్షపు నీరు చేరుతోంది. గ్రామస్తులు అధికారులకు అభినందనలు తెలిపారు.



ఎనుములపల్లి చెరువుకు చేరుతున్న వర్షం నీరు

కారులో కర్ణాటక మద్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని కోటంపల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలో గురువారం రాత్రి ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారును వదిలి డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో వెంకటంపల్లికి చెందిన రమణారెడ్డి కాలికి తీవ్ర గాయమైయింది. గాయపడిన వ్యక్తిని మరో వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చెన్నేకొత్తపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారును పరిశీలించారు. అందులో కర్ణాటకకు చెందిన 750 మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. పారిపోయిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారులో లభించిన కర్ణాటక మద్యం